నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 16 జనవరి 2025 | KHAMMAM

అగ్నికి ఆహుతవుతున్న పత్తి బస్తాలు

ఖమ్మం పత్తి మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన వందలాది పత్తి బస్తాలు
- సుమారు రూ.35 లక్షల మేర నష్టం
- ప్రమాదంపై అనేక అనుమానాలు!
- 'ఫైర్' సేవలు లేకపోవడంతో తీవ్రనష్టం

ఖమ్మం వ్యవసాయం, జనవరి 15: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. గడిచిన ఐదు రోజులుగా మార్కెట్‌కు వారాంతపు, సంక్రాంతి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం తిరిగి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగనున్నాయి. ఈ తరుణంలో బుధవారం రాత్రి ఓ షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో క్షణాల్లో దాదాపు 8 వందలకు పైగా పత్తి బస్తాలు కాలి బూడిదయ్యాయి. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న త్రీటౌన్, ఇతర ప్రాంతాల పోలీస్ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక వాహనాల సహాయంతో మంటలను ఆర్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతం నుంచి వాహనం వచ్చేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని మార్కెట్ సిబ్బంది, ఏఎంసీ బాధ్యుల నిర్లక్ష్యమే కారణమని వ్యాపారులు పరస్పరం ఆరోపించుకున్నారు. అయితే, ఆకతాయిలు సిగరెట్, బీడీలు తాగి వాటిపై పడేసి ఉంటారని మార్కెట్ సిబ్బంది అనుమానిస్తున్నారు. నిరుడు సైతం తెల్లవారుజామున ఇదే పత్తి మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో వందలాది పత్తి బస్తాలు కాలిబూడిదయ్యాయి. బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు పత్తి ఖరీదుదారులకు సంబంధించి 8 వందల బస్తాలు కాలి బూడిదైనట్లు సమాచారం. దాదాపు రూ.35 లక్షల నష్టం వాటిల్లినట్లు ఖరీదుదారులు వాపోయారు.

ఖరీదుదారులకు గోడౌన్‌లుగా మారిన షెడ్లు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని ప్రధాన షెడ్లు ఖరీదుదారులకు గోడౌన్‌లుగా మారాయి. ప్రస్తుతం మార్కెట్ పరిధిలో మూడు యార్డులు అందుబాటులో ఉన్నాయి. ఒకటి మిర్చి క్రయవిక్రయాలకు ఉపయోగిస్తుండగా, మరో యార్డులో పత్తి, అపరాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇకపోతే మూడో షెడ్‌లో మిర్చి ఖరీదుదారులు కొనుగోలు చేసిన పంటను ఆరబెట్టుకునేందుకు, లారీలో పంటను లోడ్ చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. పత్తి యార్డును సైతం పత్తి ఖరీదుదారులు తమ సొంత గౌడ్‌లుగా ఉపయోగిస్తున్నారు. సాధారణంగా ఏరోజు కొనుగోలు చేసిన పంటను అదేరోజు వ్యాపారులు తమ సొంత వాహనాలలో ఇతర ప్రాంతాలకు గాని, గోడౌన్‌లకు గాని తరలించాల్సి ఉంటుంది. వరంగల్ ఏనుమాముల మార్కెట్లో సైతం ఇదే విధానం కొనసాగుతున్నది. కానీ.. ఖమ్మం ఏఎంసీలో మాత్రం ఖరీదుదారులు ఏండ్ల తరబడి షెడ్‌లను గోడౌన్‌లుగా మార్చుకోవడంతో ప్రమాదం జరిగిన ప్రతిసారి మార్కెట్ నిధుల నుంచి నష్టపరిహారం అందించడం పరిపాటిగా మారింది. నిరుడు కూడా ఇదే తీరులో ప్రమాదం జరిగినప్పటికీ అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

రూ.కోటి వెచ్చించినా 'ఫైర్' సేవలు కరువు

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న ఖమ్మం మార్కెట్లో అగ్నిమాపక సేవలు అందుబాటులో లేకుండాపోయాయి. గత కొద్ది సంవత్సరాల క్రితం నాటి సర్కార్ అగ్నిమాపక భవనం నిమిత్తం రూ.55 లక్షలు వెచ్చించి నిర్మాణం పూర్తి చేసింది. మరో రూ.50 లక్షలు వెచ్చించి కొత్త వాహనాన్ని సైతం కొనుగోలు చేశారు. నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాహనం, భవనాన్ని ప్రారంభించారు. ఏమైందో ఏమో తెలియదు కానీ మూడు నెలలు గడవకముందే వాహనం కనిపించకుండా పోయింది. సీజన్ వచ్చిన ప్రతిసారి మీడియాలో కథనాలు ప్రచురితమైన సందర్భంలో అలా వాహనం కనిపించడం తర్వాత కనపడకుండా పోవడం సర్వసాధారణమైంది. ఆయిలింజన్ సహాయంతో నీటిని పంపుచేసే పరికరాలు యార్డులో ఉన్నప్పటికీ బుధవారం ఆపరేట్ చేసే సిబ్బంది లేకపోవడంతో తీవ్రనష్టం జరిగింది.

ఏఎంసీని సందర్శించిన ఎమ్మెల్సీ మధు

ఏఎంసీ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 15: నగరంలోని పత్తి యార్డును బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు బుధవారం రాత్రి సందర్శించారు. పార్టీ నేతలు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ తదితర ముఖ్య నాయకులతో కలిసి యార్డును కలియతిరిగిన తాతా మధు.. మార్కెటింగ్, పోలీసు, అగ్నిమాపక శాఖ, వ్యాపారులతో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలతోపాటు ఎంత మేర నష్టం జరిగింది? పంట రైతులకు చెందిందా? వ్యాపారులదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోషులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని, నూతన పాలకవర్గం ఇలాంటి పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు డెడికేటెడ్ ఫైర్ ఇంజిన్‌ను మార్కెట్‌కు కేటాయించాలని, ముఖ్యంగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమయపాలన పాటించాలి: డీఎంహెచ్‌వో

రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ముదిగొండ, జనవరి 15: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి అన్నారు. మండలంలోని వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలలో పరికరాలన్నీ పనిచేసేలా చూసుకోవాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ల్యాబ్‌లో నిర్దేశించిన జబ్బులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యాధి లక్షణాలు ఉన్న వారిని పరీక్షించి జాగ్రత్తలపై తగిన సూచనలు చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి ధర్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సంబురంగా సంక్రాంతి

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన మూడు రోజుల పండుగ
- బంధుమిత్రులతో కళ కళ లాడిన ఇళ్లు, లోగిళ్లు
- రంగవల్లులు, గొబ్బెమ్మలతో మురిసిన వాకిళ్లు
- విన్యాసాలు చేసి ఆకట్టుకున్న డూడూ బసవన్నలు

వాతావరణం, జీవావరణం, పర్యావరణాల మహా సమ్మేళన మే సంక్రాంతి. అలుకు చల్లిన వాకిళ్లు; నేలను పరుచుకున్న ముగ్గులు; రేగిపళ్లు, చెరుకు గడలు, గొబ్బెమ్మలతో నిండిన రంగవల్లులు; సర్వపిండి వంటలు; ఆకాశాన్ని తాకే గాలిపటాలతో శ్రమైక జీవన సౌందర్యానికి అద్దం పట్టింది సంబురాల సంక్రాంతి. పంటలు చేతికొచ్చే ప్పుడు జరుపుకునే వేడుక. శ్రమ ఫలించి గాదెలు నిండిన రోజు. సంస్కృతిలో భాగమైన పండుగ రోజు. బతుకుదెరువు రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న సొంత వాళ్లంతా సొంతూళ్లకు చేరుకునే పండుగ రోజు. మూడు రోజులూ తమ వారితో సంతోషంగా జరిగే రోజు. ఇంతటి విశిష్టతలు, ఇన్ని ప్రత్యేకతలు ఉన్న సంక్రాంతి ప్రతి ఒక్కరికి ఆనందాలు పంచింది. మొత్తానికి ఈ మూడు రోజుల పండుగ సంబురంగా ముగిసింది. సోమవారం భోగి, మంగళ వారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లో పండుగ శోభ నెలకొన్నది. డూడూ బసవన్నలు విన్యాసాలు చేశారు. తొలిరోజు భోగినాడు జిల్లా ప్రజలు పూజలు చేశారు. తమ చిన్నారులపై భోగిపళ్లు పోసి వారిని ఆశీర్వదించారు. రెండోరోజు మకర సంక్రాంతి నాడు కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులను ఆహ్వానించారు. అందరూ కలిసి ఘుమఘుమలాడే పిండివంటలను ఆరగించి సంతోషంగా గడిపారు. మూడో రోజు కనుమ నాడు మాంసాహారాలతో విందు భోజనాలు చేశారు. ఈ మూడు రోజులూ పిల్లలు, పెద్దలు తమ వారితో కలిసి తమ సొంతూళ్లలో సందడిగా, సంతోషంగా గడిపారు. పిల్లలు గాలిపటాలతో ఆనందంగా ఆటలాడుకున్నారు. పెద్దలు ఇష్టదైవాలకు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

–కొత్తగూడెం టౌన్/రామవరం, జనవరి 15

120 వెరైటీలతో కొత్త అల్లుడికి విందు

సంక్రాంతి సందర్భంగా వైరాలోని ఓ కుటుంబం తమ ఇంటి కొత్త అల్లుడికి 120 రకాల వెరైటీలతో విందు భోజనం ఏర్పాటుచేసి ప్రత్యేకతను చాటుకుంది. వైరా 12వ వార్డులో నివసిస్తున్న బాలాజీ జ్యూయలరీ షాపు నిర్వాహకులు నందిగామ భాస్కర్‌రావు, సుజాత దంపతులు తమ రెండో కుమార్తె మధుశ్రీకి ఇటీవల వివాహం జరిపించారు. కొత్త అల్లుడైన భద్రాద్రి జిల్లా దమ్మపేట సుదాపల్లికి చెందిన కొనకొల్ల సందీప్‌ను సంక్రాంతికి ఆహ్వానించి అతిథి మర్యాదలతో 120 రకాల స్వీట్లు, వంటకాలను నూతన దంపతులను వడ్డించి ఆనందపరిచారు.

సత్తుపల్లిలో హరిదాసుకు దానం చేస్తున్న మహిళ

టేకులపల్లిలో సంక్రాంతి ముగ్గు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతులు

చుంచుపల్లిలో..

లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ

సంక్షేమ పథకాల సర్వేలను పారదర్శకంగా పూర్తిచేయాలి: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్

ఖమ్మం, జనవరి 15: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వేల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఈ అంశంపై అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ఆయా శాఖల అధికారులతో ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాల విధివిధానాలను ప్రభుత్వం జారీ చేసిందని అన్నారు. వీటిపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. రైతుభరోసా కోసం వ్యవసాయ యోగ్యమైన, వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించేందుకు నేటి నుంచి సర్వే చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెల 1లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, ఈ నెల 20 నుంచి గ్రామసభల నిర్వహణకు కార్యాచరణ చేయాలన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు పునః పరిశీలన చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథక లబ్ధిదారులకు ఏడాదికి రూ.12 వేలను రెండు విడతలుగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈజీఎస్ జాబ్‌కార్డుపై ఏడాదిలో కనీసం 20 రోజులు పని చేసిన భూమి లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులన్నారు. అలాగే, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముగింపు దశకు చేరిందన్నారు. సర్వే సమయంలో ఒక గ్రామంలో ఉన్న లబ్ధిదారుడికి భూమి ఏ గ్రామంలో ఉంటే ఆయా గ్రామంలోనే మంజూరు పత్రాలు ఇవ్వాలన్నారు. డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, డీసీఎస్‌వో చందన్‌కుమార్, డీఏవో పుల్లయ్య, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో నూరొద్దీన్, డీఎల్‌పీవో రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

మొదటి విడతలో పేదలకు ప్రాధాన్యం

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ విజయవంతం చేయాలి: భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 15 (నమస్తే తెలంగాణ): ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ విజయవంతం చేయాలని, లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు విధివిధానాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఈ నాలుగు సంక్షేమ పథకాల అమలును ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభించనున్నారని, ఈ నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. గ్రామసభలను పక్కాగా నిర్వహించాలని, ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు చేపట్టే క్షేత్రస్థాయి సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని, 16 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభలు పక్కాగా జరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, 21 నుంచి 25వ తేదీ వరకు డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు., ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

'సుప్రీం'లో కూనంనేని పిటిషన్ కొట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 15 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. తెలంగాణ హైకోర్టులో తనపై దాఖలైన ఎన్నికల అఫిడవిట్ పిటిషన్ రద్దు చేయాలని సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిని సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ చేసి డిస్మిస్ చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన సాంబశివరావుపై కొత్తగూడేనికి చెందిన నందూలాల్ అగర్వాల్ అనే వ్యక్తి.. ఎమ్మెల్యే సమర్పించిన ఫారం-26 అఫిడవిట్‌లో పూర్తి సమాచారం పొందుపరచలేదని, భార్య పేరు రాయలేదని, లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని సవాల్ చేస్తూ ఎమ్మెల్యే సాంబశివరావు సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. పరిశీలించిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది.

న్యాయస్థానంపై నమ్మకం ఉంది: కూనంనేని

ప్రత్యర్థి ప్రోద్బలంతో ఒక వ్యక్తి ఆధారాలు లేని పిటిషన్ వేశారని, ఇందులో ప్రాథమిక ఆధారాలు లేవని కూనంనేని బుధవారం తెలిపారు. న్యాయస్థానంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఈ కేసును సుప్రీం కోర్టు.. హైకోర్టులోనే తేల్చుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.



అదృశ్యమయ్యాడు.. శవమై తేలాడు!

- మిస్టరీగా మారిన సంజయ్ అదృశ్యం, మరణం..
- కరుణగిరి ప్రాంతంలో ఈ 13న అర్ధరాత్రి మిస్సింగ్
- తనికెళ్ల వద్ద సాగర్ కాల్వలో మరుసటి రోజు మృతదేహం
- భోరుమన్న బాధిత కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు..
- న్యాయం చేయాలంటూ కరుణగిరి వద్ద రాస్తారోకో
- సంచలనంగా మారిన రాజీవ్ స్వగృహ యువకుడి డెత్

రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులను ఎత్తుకెళ్తున్న పోలీసులు

ఖమ్మం రూరల్, జనవరి 15: అన్నను తీసుకురావడానికి వెళ్లిన తమ్ముడు ఈ నెల 13న ఖమ్మం జిల్లా రూరల్ మండలం కరుణగిరిలో అదృశ్యమయ్యాడు. మూడు రోజుల తర్వాత కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని సాగర్ కాల్వ లాకుల వద్ద శవమై తేలాడు. దీనికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీవాసులు ఖమ్మం నగరంలోని జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి ప్రాంతంలో ఉన్న రాజీవ్ స్వగృహలో నివాసం ఉంటున్న పందెపు సంజయ్‌కుమార్.. హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న తన అన్న జ్ఞానసాయిని తీసుకొచ్చేందుకు ఈ నెల 13న అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిన విషయం తెలిసిందే. అయితే పది నిమిషాల వ్యవధిలోనే రెండు సార్లు అన్న సెల్‌ఫోన్‌కు తమ్ముడు వాయిస్ మెసేజ్ చేశాడు. 'తనను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కొడుతున్నారు. ఆటోలో ఉన్నా. అదే ఆటోలో ఓ అమ్మాయి శవం కూడా ఉంది' అని వాయిస్ మెసేజ్ ఉంది. దీంతో వెంటనే సాగర్ కాల్వ కట్ట వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులకు సంజయ్ జాడ తెలియరాలేదు. అక్కడ అతడి బైక్ మాత్రమే కనిపించడంతో ఆందోళనకు గురైన సదరు కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఫలితం లేకుండాపోయింది. దీంతో మరుసటి రోజు సంజయ్ మిస్సింగ్‌పై కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తనికెళ్ల సాగర్ లాకుల వద్ద శవం లభ్యం

ఈ నెల 13న అర్ధరాత్రి అదృశ్యమైన సంజయ్‌కుమార్ మంగళవారం కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని సాగర్ కాల్వ లాకుల వద్ద శవమై తేలాడు. ఉదయం అటువైపు వెళ్లిన కొందరు వ్యక్తులకు లాకుల వద్ద శవం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం చేరవేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సంజయ్ మృతదేహంగా అనుమానించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో విగతజీవిగా ఉన్న సంజయ్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అదృశ్యమైన సంజయ్‌గా నిర్ధారణ అయిన తర్వాత మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. బుధవారం పోస్టుమార్టం చేయించారు. మృతదేహం వద్దే అతడి సెల్‌ఫోన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మృతుడి ప్యాంటు జేబులో పగిలిన క్వార్టర్ మందు బాటిల్‌ను సైతం పోలీసులు కనుగొన్నట్లు తెలుస్తున్నది. దుండగులు కొడితే సెల్‌ఫోన్ జేబులో ఎలా ఉంది? మద్యం అలవాటులేని అతడి జేబులోకి పగిలిన బాటిల్ ఎలా వచ్చింది? అనేది తేలాల్సి ఉంది.

కరుణగిరి వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు

న్యాయం చేయాలంటూ ధర్నా

సంజయ్ మృతికి కారణం ఎవరో తెలపాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కరుణగిరి వద్ద రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు, బాధిత కుటుంబ సభ్యులు బుధవారం భారీ ధర్నా చేపట్టారు. సంజయ్ ఫ్లెక్సీలతో జాతీయ రహదారిపై కూర్చొని నిరసన తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కాలనీకి మృతదేహం తీసుకొన్ని వాహనానికి అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. దాదాపు గంటకు పైగా ధర్నా చేపట్టడంతో ఇరువైపులా వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రూరల్ సీఐ ఎం.రాజు ఆందోళనకారులకు నచ్చజెప్పినా ఫలితం లేకుండాపోయింది. విషయం తెలుసుకున్న రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, నగర ఏసీపీ రమణమూర్తి ఘటనా స్థలానికి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలతో చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని, సంజయ్ మృతి మిస్టరీ ఛేదించడంలో పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని నినాదాలు చేశారు. మరోసారి వారితో చర్చలు జరిపినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు. బలవంతంగా ఎత్తుకెళ్లారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. సాయంత్రం సంజయ్ స్నేహితులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు, అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.